# నెత్తురు కూడు

నరనరంలోనూ వున్న శక్తినంతా కూడ దీసుకుని నడుస్తున్నాడు 'ఒరే అసిరిగే' అని పిలవబడే అసిరయ్య.

ఏళ్ళ నుంచి అతడి శరీరాన్ని మోసీ మోసీ ఎండిన పుల్లల్లా తయారైన అతడి కాళ్ళు తడబడుతున్నాయ్. అలసిన గుండె అసహనంగా కొట్టుకుంటోంది. మా పని అయిపోయిందని చెప్పక చెబుతోంది తోళ్ళలా వ్రేలాడుతోన్న తాటికాయరంగు చర్మం.

అతడి శరీరాన్ని కప్పలేకపోయినా అతడ్ని అంటిపెట్టుకొని వ్రేలాడుతోంది చిరిగి పీలికలైన రంగు వెలసిన చొక్కా. అలాటి గుడ్డే మొలని చుట్టుకుంది. రెండు రకాల అరిగిన చెప్పులు రెండు కాళ్ళకి కాస్తంత రక్షణనిస్తోంటే కుడి చేతిలోని కర్ర మరి కాస్త వూతం ఇస్తోంటే దేకుతున్నట్టుగా నడుస్తున్నాడు.

అతడి ఎడమ చేతిలో వున్న రూపం మారిన పేవండి గిన్నె మాత్రం అతడి పొట్టలానే ఖాళీగా వుంది.

ఆయాసపడుతూ ఆగి కళ్ళపైన అరచెయ్యి అడ్డుగా పెట్టుకుని చూశాడు అసిరయ్య.

అతడి కళ్ళనిండా అశ-అశ!

కళ్ళల్లోనే కాదు అతడి సర్వావయవాల్లోనూ మెరుస్తోన్నది ఒకటే మాట-ఆశ! అతడి శరీరంలోని ప్రతి కణంలోనూ ప్రతిధ్వనిస్తున్నది కూడా ఒకటే మాట - ఆకలి!

శరీరం సమ్మె చేస్తోన్నా ఆకలి నడిపిస్తోంటే ఆశ దారి చూపు తోంటే అతి కష్టం మీద నడుస్తోన్న అసిరయ్య కళ్ళు చించుకుని మరీ చూశాడు.

కొంత దూరాన ఇళ్ళు కన్పించాయ్. మరోసారి నిట్టూర్చి ముందు కడుగేశాడు సుర్రుమని మాడుతోన్న మాడు నోసారి తడుముకుని.

"ఆకరికి సూరీడుకూడా మండిపోతన్నాడు. సీ-ఎదవ జలమ! ఎలా పుట్టేడో తనకే తెల్దు. ఎలా పెరిగాడో బగమంతుడికే తెలవాల. తనకి మంచీ సెబ్బరం తెలిసినకాడ్నుంచీ కూలోనాలో సేత్తానే వున్నాడు. రెక్కల్ని ముక్కలు సేసుకుంటూనే వున్నాడు. అయినా కూటి కోసం ఎప్పుడూ అవిరాన పడతానే వున్నాడు. తిండి పేగు ఎప్పుడూ అవురావు రుమని ఏడుత్తానే వుంది. పుట్టింది లగాయితు గుప్పెడు మెతుకుల కోసం దేవుళ్ళాడేగందా ఎదవ బతుక్కి! కాలూ సెయ్యీ వంగిన కాడ్నుంచీ ఎక్కేగుమ్మం దిగే గుమ్మం సీదరింపులూ సీత్కారాలూ అయిపాయె! ఛీ - రోత బతుకు మా సెడ్డ బరువైపోయింది! ఏ జలమలో ఏం జేసేనో ఎవుడి వుసురేసుకున్నానో యిదిగో ఇలా ఏడుత్తున్నాను కూటికీ గుడ్డకీ నోసుకోక!—" గొణుక్కుంటూ నడుస్తోన్న అసిరయ్య చత్వారపు కళ్ళల్లో ఓ చక్కని మేడ పడింది!

అతడి కళ్ళు మెరిశాయ్.

"కలిగున్న మా రాజులే కనికరించాల...." అనుకుంటూ 'లక్ష్మీ నిలయం' అని పాలరాతి పలక మీద చెక్కబడ్డ ఆ మేడవైపు లేని శక్తి తెచ్చుకుంటూ ఆశగా ఆరాటంగా అడుగులేశాడు అసిరయ్య.

* * *

రామనాథంగారు పడక కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుం టున్నా రన్నమాటేగాని ఆయన చూపులు పేపరు మీదలేవు. కడుపులో ఎలుకలు పరుగెడుతోంటే పేపరెవడి క్కావాలి, పాలిటిక్సెవరి క్కావాలం టారు అదేమని ప్రశ్నిస్తే.

అంచేత మాటి మాటికీ వంటింటివైపు చూస్తున్నారు.

అక్కడాయన కోడలుంది. ఆవిడ పిలిస్తేగాని తనకి భోజనం వుండదు. ఆ పిలుపు కోసమే పాపం ఆయన నిరీక్షిస్తున్నారు.

"ఛ ఛ - కోడలికి బొత్తిగా బుద్ధిలేదు. అబ్బాయి భోంచేసి ఆఫీ సుకి వెళ్ళిపోయి గంటన్నర కావస్తోందా యిప్పటికైనా తనని భోజనానికి పిలవకపోతే ఎలా చచ్చేగి ఖర్మ?! ఆవిడ శుభ్రంగా తిని మొఖం కడు క్కుని, సింగారించుకుని, తీర్చి పార్చి యెప్పుడో పిలుస్తానంటే అంత వరకూ ఈ ముసలిప్రాణం నిలవొద్దూ?!

ఏవిటో.... వెనకాలున్న కాస్త ఆస్తి అర్పేయబట్టి ఈవిడ వేసే నాలుగు మెతుకులకోసం ప్రాకులాడాల్సొస్తోందిగాని లేకపోతే .... అసలిది వరకు తనెలా వెలిగాడో కోడలు పిల్లకి తెలిసుంటే తన నిలా గడ్డిపరకలా చూసేదా అని? ఆ రోజుల్లో తనకి డబ్బంటే లెక్కేలేదు. పేకాటే ప్రాణంగా మసిలాడు తను. ఇంటి దగ్గర్నుంచి సుబ్బారావు కాఫీ హోట ల్కి (ఆ హోటల్ వెనుకనున్న గదే పేకాటస్థలం) డబ్బు పట్టుకెళ్ళడమే గాని అక్కడ్నుంచి యింటికి ఒక్క పైసాకూడా తెచ్చెరగడు ఒక్క నాడూ. అంటే పేకాట్లో ఏం వచ్చేది కాదనికాదు. బాగానే వస్తూండేది అప్పుడప్పుడూ. కాని అందర్లా మొలలో దాచుకుని యింటికి పట్టుకెళ్ళే వాజమ్మకాదు తను. అంచేతే పేకాట్లో వచ్చిన డబ్బుని అప్పుడే అక్కడే ఖర్చు పెట్టేసేవాడు. కోడిని కోయించి మాంసం పకోడీలు వేయించి తాటి చిగురు తెప్పించేవాడు. రామనాథంగా మనిషంటే — అన్పించుకున్నాడా రోజుల్లో. కానేపై తేనేం పేకాట యింటితోసహా సర్వాన్నీ హరించేసింది.

ఏదో సంపాదించెయ్యాలనుకున్నాడు గాని యిలా అవుద్దని తనుమాత్రం కలగన్నాడా? అంతా అలా జరిగిపోయిందంతే!

"చదువెందుకురా పశువుల్ని కాయక" అని తిట్టినా వినక చదువుకున్నందుకు అబ్బాయికేదో ఉద్యోగం వచ్చింది. పెనకేం మిగలకపోవడంతో తనూ వాడి పంచన చేరక తప్పలేదు. అబ్బాయిని సరిగ్గా చదువుకో నిచ్చేవాడ్ని కాదనీ, సరిగ్గా చూసేవాడ్ని కాదనీ కోడలికి గుర్రు !

"హుఁ బాగానేవుంది. ఇప్పుడప్పుడే ఆ మహారాణి పిలిచేట్టులేదు ఖర్మ!" అనుకుంటూ వుస్సురంటూ లేచి యింట్లోకెళ్ళి దొంగచాటుగానైనా ఏమైనా చిరుతిండి తిందామని చూశారుగాని లాభం లేకపోయేసరికి 'రామ రామ' అనుకుంటూ వీధిలో కొచ్చారు.

తమ యింటి కెదురుగుండా రోడ్డు కవతలి ప్రక్కనున్న లక్ష్మీనిలయాన్ని, ఆ మేడ వరండాలో సింహాసనం మీద కూర్చున్నట్టుగా కూర్చునున్న సార్వభౌమారావు గార్ని చూసి కించిత్తు అసూయపడ్డారు.

ఆ మేడలోంచి వస్తోన్న కమ్మని పరిమళాన్ని ఆయన ముక్కు అదేపనిగా ఆస్వాదిస్తుంటే గాఢంగా నిట్టూర్చారు.

"భోగమంటే వాళ్ళదేలే. ఆ ముసలాయన కొడుకులు ఏం వ్యాపారాలు చేస్తున్నారో యేమోగాని ఆ యింట్లో యెప్పుడూ విందులే! వినోదాలే! వాళ్ళ ఎదురింట్లోనే తామూ వుంటున్నాంగదా ఆ ముసలాయనకి కనిపించినప్పుడల్లా తను నమస్కారం చేస్తూనే వున్నాడుగదా! పైగా తనాయనకు సమవయస్కుడు కదా! ఒక్కసారయినా ఒక్క విందుకైనా పిలవకూడదూ? వూహూ - పిలవరు!

ఈ పెధవ నోరు యిదివరకు నాలుగు రుచులూ తినుందేమో కోడలు పెట్టే వంకాయ కెంకాయ కూరలు తినలేక తింటోందేమో ఒకటే జిహ్వాచాపల్యంగా వుంటోంది. ఓ సారయినా వాళ్ళింటికి పిలిచి యేదో కాస్త పారేస్తే బావుణ్ను! అసలందుకే ఆ ముసలాయన్ని మంచి

చేసుకుందామన్నీ ఎంత కల్పించుకున్నా ఆ ముసలి ముండావాడు పలకరించదే ఖర్మ! ఇంకెలా చచ్చేదంట?!"

గాఢంగా నిట్టూర్చారు రామనాథంగారు.

*    *    *

'లక్ష్మీనిలయం' వరండాలో మెత్తని కుర్చీలో హాయిగా కూర్చున్నారు సార్వభౌమారావుగారు.

దబ్బపండు రంగు మేని ఛాయ, తెల్లని పంచె. లాల్చీ, పైమీద లేతుపచ్చని శాల్మీరు శాలువాతో వుండే ఆయన ముసలి పులిలా వుంటారన్పొచ్చు ఒక్క మాటలో చెప్పాలంటే.

కుర్చీ మెత్తగా, సౌకర్యంగానే వున్నా అసహనంగా కదిలారు.

లోపల్నుంచి కమ్మని సువాసనలు అదేపనిగా వస్తూ ఆయన జిహ్వతో కుస్తీ పడుతున్నాయి.

నోట్లో వూరిన లాలాజలాన్ని మ్రింగేసి యింటి లోపలికి కోపంగా చూసి ముటముటలాడారు కాస్సేపు.

"ఏమిటో! — అన్నీవుండి అయిదోతనం లేనట్టుగా అయిపోయింది తన బ్రతుకు! తన తండ్రి తన కిచ్చిపోయిన ఆస్తిని నాలుగురెట్లు చేసి పిల్లలకిచ్చాడూ అంటే దానికి వాళ్ళు చూపే కృతజ్ఞత యిదా అని? ఇంట్లో షుగర్ పేషంటు వున్నాడన్న జ్ఞానమైనా లేకుండా రోజూ విందు లేనా?! ఒక్క షుగరేం ఖర్మ బీపీతో సహా అన్నీ తననే పట్టుకున్నాయ్ లోకంలో ఇంక జనమే లేనట్టు! ఇదివరకు స్వీట్లంటే పడి చచ్చేవాడు తను. ఇక ఫ్రై చేసిన కోడి జాయింట్లంటే — అబ్బ చెప్పలేనంత ఇష్టపడేవాడు. కానేం లాభం? అన్నీవున్నా అనుభవించే అవకాశం లేకుండాపోయింది. స్వీట్లు తినకూడదు. కోడిమాంసం వాసన కూడా చూడకూడదు. ఇవేకాదు ఇంకా సవాలక్ష తినకూడదు. పంచదార లేని

పాలూ, ఉలవచారూ, మినపరొట్టె — యిలాటి గడ్డే తినాలి! ప్చ్.... అమెరికా వాడయినా ఈ షుగర్ వ్యాధి శకీముని తగ్గే మందు కనిపెడితే బావుణ్ను. యాఖంగా అక్కడికే వెళ్ళి నయం చేయించుకునొచ్చేవాడు!"

పుస్సురని నిట్టూర్చా రాయన.

జానీ అని పేరుగల వారి తెల్ల బొచ్చుకుక్క ఆయన కాళ్ళ దగ్గరి కొచ్చి ఆప్యాయంగా చూడసాగింది నాలిక చాచి. మధ్యమధ్య యేదో తన భాషలో గొణుక్కోసాగింది కూడాను.

దాని తలని ఆప్యాయంగా నిమిరి "నిన్ను మర్చిపోలేదే. నిజానికి నాకన్నా నువ్వే అదృష్టమైందానివే. వారానికి నాల్రోజులు నీకు మటన్ అయినా దొరుకుతోంది!" అంటూ లోపలి కెళ్ళి అరమాలలోంచి కుక్క బిస్కెట్ల పాకెట్ తీసుకునొచ్చి మళ్ళీ తన కుర్చీలో కూర్చున్నారు.

ఒక బిస్కెట్ తీసి జానీకి చూపించారు. అది అందుకోబోయింది. వెనక్కు తీసుకున్నారు. ఇంకా ముందు కొంగింది. ఆయనింకా వెనక్కి దాచారు. ఆయన కాళ్ళమీద కెక్కి అందుకోబోయింది. దాని నాడించాలన్పించి ఆయనింకా వెనక్కెనక్కి చాస్తూంటే అది ఆయన మీదకెక్కి కాళ్ళతో రక్కుతూ అందుకోడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇంకా ఆడిస్తే తన వళమంతా గీరేస్తుందేమోనని భయపడి దానికా బిస్కెట్ అందిచ్చి వాళ్ళో కూర్చోబెట్టుకుని ఒక్కొక్కటీ ఆప్యాయంగా తినిపించ సాగారు సార్వభౌమారావుగారు.

గేటు దగ్గర శబ్దమయ్యింది.

తలెత్తి చూశారాయన.

ముసలి భిక్షగాడు ఒగురుస్తూ చెమట్లు కక్కుతూ దీనంగా చూస్తూ నిలబడ్డాడు.

సార్వభౌమారావుగారి నుదురు ముడివడింది.

"కుక్క ఉన్నది జాగ్రత్త-అన్న బోర్డు చూడ లేదా లేక చూసే నేనూ కుక్కలాంటి వాడ్నే గనుక ఫరవాలేదనుకుని వచ్చావా ఇడియట్" అనుకుంటూ కోపంగా చూశారు.

యజమాని కోపం చూసి తనూ తన వంతుగా మొరిగింది జానీ. ఇంకాస్సేపు మొరిగేదేగాని మొరగటం కన్నా మెక్కడం ముఖ్యం అను కుంది కాబోలు మౌనంగా ఆ పన్లో పడింది.

చేతులు జోడించి నిలబడ్డాడు అసిరయ్య వెన్నుకంటిన తన కడు పుని చూపించి.

జానీని క్రిందకి దింపి నిలబడ్డారు సార్వభౌమారావుగారు తన రాజ్యంలో అక్రమంగా చొరబడ్డ శత్రువుని చూసినట్టు చూస్తూ.

ఇదంతా తమ ఇంటి అరుగుమీంచి ఆసక్తిగా చూస్తూ నిలబడ్డారు రామనాథంగారు.

"ఏంరా" గర్జించారాయన.

కడుపుని చేత్తో కొట్టుకుని ఏమీ లేదన్నట్టు చెప్పి తినడానికేమైనా పెట్టమని సైగ చేస్తూ అడిగి అత్యంత దీనంగా అర్థింపుగా చూస్తూ నిల బడ్డాడు అసిరయ్య కాలే ఎండలో కారుతున్న చెమట్లతో.

"పోరా ఇడియట్" అని ఓ పిడుగుని వాడి మీద పారేద్దా మను కున్నారు అడక్కుండా అనుమతి లేకుండా గేటుతీసి మరీ నిలబడి నందుకు.

ఇంతలో ఓ చక్కని ఆలోచన వచ్చిందాయనకి.

రమ్మని సైగ చేశారు.

సంబరంగా సమీపించాడు అసిరయ్య.

రామనాథం గారి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయ్.

నౌకర్ని పిలిచి స్వీట్లూ అన్నం కూరలూ అన్నీ ఓ ప్లేటులో పెట్టుకుని రమ్మని ఆర్డర్ వేశారు సార్వభౌమారావుగారు.

అసిరయ్యని చూసి "వాడికి పెట్టానిక్కాబోలు. తన కెలాగూ తినడానికి లేదని ఇలా పెట్టి తృప్తి పడాలనుకుంటున్నారు కాబోలు" అను కుని మరిన్ని పదార్థాలు ప్లేటునిండా పెట్టుకు నొచ్చాడు నౌకరు.

వాడి చేతిలోని ప్లేటు నందుకున్నారు సార్వభౌమారావుగారు.

ఆయన వంక విడ్డూరంగా చూస్తోంటే లోపల్నుంచి పిలుపొచ్చింది. దాంతో అయిష్టంగానే కదిలెళ్ళాడు నౌకరు.

"ఒరే- అన్నం వేస్తున్నాను అందుకో" అంటూ ఓ గుప్పెడు మెతుకుల్ని అసిరయ్య మీదకి విసిరాడు.

అవి వాడి మీదా వాటి చుట్టూనూ పడ్డాయ్ చెల్లా చెదురుగా. అయినా లెక్క చెయ్యకుండా మెట్ల మీది మెతుకుల్ని ప్రోగుజేసుకుని నోట్లో కుక్కుకున్నాడు ఆత్రంగా అసిరయ్య.

అయిష్టంగా చూశారు సార్వభౌమారావుగారు. ఈసారిలా కాదను కుని మరింత వెనక్కి- ఇసుకలో పడేట్టుగా విసిరారు మరో గుప్పెడు మెతుకుల్ని.

ఆ వెదజల్లిన మెతుకుల కోసం ఆరాటపడ్డాా అన్నార్తుడు. అయినా దొరికినవి పిడికెడు కూడా లేవు. అవైనా దుమ్ము ధూళితో నిండినవి!

జాలిగా బాధగా కన్నీళ్ళొంచి చూశాడు అసిరయ్య.

"ఒరేయ్- స్వీట్సు వేస్తున్నాను. ఇలాటివి నీ జన్మలో తినుండవ్. ఇంకో పది జన్మలెత్తినా ఇలాటివి తిన్లేవు. పూ- ఏరుకోరా" అంటూ రకరకాల స్వీట్సుని ముక్కలు చేసి విసిరేశారు.

వాటి కోసం నేల మీద దేకుతూ ప్రోగుజేస్తూ దొరికిన దుమ్ము అంటుకున్న ముక్కల్ని ఆశగా ఆతృతగా తిని మిగిలినవి దొరక్క ఆకలి తీరక నిరాశగా జాలిగా విచారంగా చూస్తోంటే వాడ్ని వాడి పరిస్థితినీ చూసి తృప్తిగా కక్ష తీరినట్లుగా నవ్వుకున్నారు సార్వభౌమారావుగారు

బుద్ధిగా కూర్చుని బిస్కెట్లు తింటోన్న జానీకి ఏం వాసన తగిలిందో ఏ క్రొత్త ఆలోచన వచ్చిందో గాని మెల్లగా సార్వభౌమారావు గార్దగ్గిరికెళ్లి గబుక్కున ఎగిరింది పళ్ళెం అందుకోడానికి.

పళ్ళెం క్రింద పడింది.

జానీ మాంసం కూర మీదకి దూకింది.

"జానీ!" అరిచారాయన కోపంతో వూగిపోతూ.

మరోసారైతే భయంతో గడగడలాడేదే. కానిప్పుడా కేకని పట్టించుకోలేదు— కన్నెత్తి చూడలేదు!

అసిరయ్య అదిరిపడి చూశాడు.

కళ్ళెదుట అన్నం !

కడుపు నిండా ఆకలి !

అన్నం వంకా కలబడి తింటోన్న కుక్క వంకా చూశాడో క్షణం. మరు క్షణం ఒక్క వుదుట నెళ్లి పళ్ళెం మీద పడ్డాడు. కుక్క బెదిరి కొంచెం వెనక్కెళ్లి గొంతు చించుకుని మొరగసాగింది.

కుక్క తినగా పళ్ళెంలో మిగిలిన పదార్థాల వంక ఆశగా ఆనందంగా చూసి ఆరాటంగా అన్నాన్ని నోట్లో కుక్కుకోబోయాడు అసిరయ్య.

కానింతలో గ్రూన్పడి చూస్తోన్న సార్వభౌమారావుగారు ఏం జరుగుతోందీ గ్రహించే లోపునే ఎక్కుపెట్టి వదిలిన బాణంలా రామనాథం గారు దూసుకొచ్చి అసిరయ్య చొక్కా పట్టుకుని లేవదీసి విసిరేసినట్టుగా వెనక్కి త్రోసేశారు.

అతడెళ్ళి ఇనుపగేటు మీద పడ్డాడు. తలకి గాయమయ్యింది. రక్తం చిమ్మింది.

అయినా అన్నం ప్లేటుని వదల్లేదు అసిరయ్య.

మరిన్ని బూతులు తిడుతూ అతడి రెక్క పట్టుకుని బయటికి త్రోసే శారు రామనాథంగారు.

గేటువేసేసి గర్వంగా నవ్వేరు. గుడ్లప్పగించి చూస్తోన్న సార్వ భౌమారావుగారి దగ్గరి కొచ్చి చిన్నగా నవ్వుతూ చేతులు కట్టుకుని నిల బడ్డారు రామనాథంగారు విశ్వసనీయమైన కుక్కలా.

"వెల్ డన్ మిస్టర్" అన్నారు ఎట్టకేలకి సార్వభౌమారావుగారు. మా జానీ కన్నా మువ్వే నయం అనుకుంటూ ప్రశంసా పూర్వకంగా చూశారు.

లోపలికి రమ్మన్లేదు. విందులో పాల్గోమన్లేదు. కనీసం కాఫీ త్రాగి వెళ్లమనైనా అన్లేదు.

కేవలం ఆ రెండు మాటలే అన్నారు. అయితేనేం ఆ మాత్రం భాగ్యానికే పంచభక్ష్య పరమాన్నాలతో తృప్తిగా భోజనం పెట్టినట్టుగా ఫీలయ్యారు రామనాథం గారు.

నమస్కారం చేసి వస్తానన్చెప్పి బయటి కొచ్చారు.

బయట—

తల మీంచి ధారాపాతంగా కారుతోన్న రక్తం ప్లేటులో పడి పదార్థాల్ని ఎర్రగా మారుస్తోంటే ఆ శెత్తుటి కూడునే ఆరాటంగా తింటు న్నాడు అసిరయ్య- ఏ మూలనో మిగిలి వున్న కాస్త ప్రాణాన్నీ నిలుపు కోవాలని!

—o—

(ఆంధ్రభూమి మాస పత్రిక జూన్' 84)